ప్రజాశక్తి

గురువారం 23 మే 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ (ఫైల్ ఫొటో)

- 1500 మంది సిబ్బంది వినియోగం
- సజావుగా సాగేలా చర్యలు
- నియోజకవర్గానికి 14 టేబుల్స్
- అసెంబ్లీ, పార్లమెంట్‌కు వేర్వేరుగా గదులు
- తొలుత పోస్టల్, సర్వీసు ఓట్ల లెక్కింపు
- తరువాత ఈవీఎంలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని ఆరు అసెంబ్లీ, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. వచ్చే నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపులో పాల్గొనే సిబ్బందికి ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం తర్ఫీదు పూర్తిచేసింది. ఆరు అసెంబ్లీ, అనకాపల్లి పార్లమెంట్‌కు చెందిన ఆరు నియోజకవర్గాల ఇవిఎంలు కలెక్టరేట్‌కు సమీపంలోని శంకరం స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. ఓట్ల లెక్కింపు నుంచి ఫలితం ప్రకటించే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందిని అప్రమత్తంచేసింది. చోడవరం, మాడుగుల, అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కో కౌంటింగ్ హాల్ ఉంటుంది. ప్రతి కౌంటింగ్ హాల్లో 14 టేబుల్స్ ఏర్పాటుచేయనున్నారు. పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు ఆరు హాళ్లలో హాల్‌కు 14 టేబుల్స్ సిద్ధంచేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభంకానుంది. లెక్కింపు సమయంలో గజిటెడ్ ర్యాంకు కల్గిన స్టాఫ్ కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్, ఇవిఎంలు అందజేయడానికి ఇద్దరు విఆర్‌ఓలు ఉంటారు.

అసెంబ్లీ ఓట్ల లెక్కింపు గదిలో రిటర్నింగ్ అధికారి టేబుల్ దగ్గర ప్రత్యేకంగా నియమించిన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో ఆ నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్, సర్వీసు ఓటర్లు, ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న ఓట్లను అసెంబ్లీ, పార్లమెంట్‌కు వేర్వేరుగా ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభించనున్నారు. తొలుత హోం ఓటర్లు 1082, ఎన్నికల సిబ్బంది ఓట్లు 12,864, సర్వీసు ఓట్లు 1051, ఇతర జిల్లాల్లో పనిచేస్తున్నవారి ఓట్లు 2,909, అత్యవసర సర్వీసు ఉద్యోగులు 1468 మొత్తం 19,374 ఓట్లను లెక్కించనున్నారు. లెక్కించనున్నారు. వీటి లెక్కింపు పూర్తయిన అరగంట తరువాత ఇవిఎంల ఓట్లు లెక్కించనున్నారు. పార్లమెంట్‌కు సంబంధించి ఇవిఎం కౌంటింగ్ గదుల్లో కాకుండా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన లెక్కింపు గదిలో 14 మంది ఎఆర్‌ఓల పర్యవేక్షణలో 14 టేబుళ్లలో లెక్కింపు జరుగుతుంది.

ఓట్ల లెక్కింపులో 1500 మంది

ఓట్ల లెక్కింపులో దాదాపు 1500 మంది ఉద్యోగులు పాల్గొంటారు. అభ్యర్థుల తరపున ఏజెంట్లు

మిగతా 2లో..

జలాశయాలు విలవిల

- ఇదే స్థితి కొనసాగితే ఖరీఫ్‌కు సమస్య
- గతేడాది కంటే తగ్గిన తాండవ

రైవాడలో తగ్గిన నీటి నిల్వలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో జలాశయాల పరిస్థితి దాదాపు గతేడాదివలె ఉంది. అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లోని 51వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే తాండవ జలాశయ నీటిమట్టం ఆందోళనకరంగా ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ కొంత ఆశాజనకంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు. వర్షాలు కాస్త ముందుగా వచ్చే అవకాశముందన్న వాతావరణశాఖ ప్రకటనతో కొంత ఊరటవున్నా, జలాశయాల నీటి మట్టాలు పరిశీలిస్తే ఆందోళన కలగమానదు. నీరు బయటకు పోకుండా జలాశయాల గేట్లు మరమ్మతులు చేపట్టాల్సివుంది. కాలువల్లో నీటి ప్రవాహానికి ఇబ్బందుల్లేకుండా లైనింగ్ చేయాల్సివుంది. ఈ పనులు గతంలో చేయకపోవడంతో జలాశయాల్లోని కొద్దిపాటి నీరు శివారు ప్రాంత ఆయకట్టుకు అందించలేని పరిస్థితి ఏర్పడింది. మే 22 నాటికి జలాశయాల నీటి మట్టాలను గమనిస్తే తాండవ, రైవాడలో గతేడాది కంటే తక్కువ నీటి నిల్వవుంది. గతేడాది మే 22 నాటికి తాండవలో 370.10 అడుగుల నీరు ఉంటే ఈ ఏడాది 355.70 అడుగులకు తగ్గింది. రైవాడలో గతేడాది 108.55 మీటర్ల నీరువుండగా, ఈ ఏడాది 104.75 మీటర్ల నీరుంది. కోనాం, వరహాలో

మిగతా 2లో..

2024 మే 22 నాటికి జలాశయాల వారీగా నీటిమట్టాల వివరాలు

జలాశయం	పూర్తిసామర్థ్యం	ప్రస్తుతం	గతేడాది
తాండవ	380.00	355.70	370.10(అడుగులు)
రైవాడ	114.00	104.75	108.55(మీటర్లు)
కోనాం	101.25	95.60	95.50(మీటర్లు)
వరహా	460.00	453.40	453.30(అడుగులు)
పెద్దేరు	137.00	135.65	133.40(మీటర్లు)

జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

వార్త మెయిన్‌లో..

ఎన్నికల ఫలితాల అనంతరం హింస చెలరేగే ప్రమాదం

వార్త మెయిన్ 3లో..

సమిష్టి కృషితోనే జీవ వైవిధ్య పరిరక్షణ

వార్త మెయిన్ 3లో..

రైళ్లకు నూతన ఎల్‌హెచ్‌బి కోచ్‌లు

వార్త 2లో..

కార్మిక సమస్యలపై ‘పర్సా’ నిరంతర పోరాటం

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్

పర్సా, తులసి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కార్మికవర్గ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన కార్మికోద్యమ నేత పర్సా సత్యనారాయణ అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ కొనియాడారు. జగదాంబ సమీపంలోని నండూరి ప్రసాదరావు భవనంలో సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యాన బుధవారం పర్సా సత్యనారాయణ వర్థంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ పర్సా సత్యనారాయణ సింగరేణిలో గుమస్తాగా పనిచేస్తూ అందులో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి యూనియన్ స్థాపించారన్నారు. పరిశ్రమ స్థాయి నుంచి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టారని గుర్తుచేసారు. దేశంలో కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేయడంలో ఆయనకాయనే సాటి అన్నారు. సింగరేణి బొగ్గు కార్మికుల సమస్యలతో పాటు నివాసప్రాంతాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సైతం అధ్యయనం చేసి పరిష్కారానికి కృషి చేసారన్నారు. విశాఖపట్నంలో హిందూస్థాన్ షిప్‌యార్డు, ఆంధ్రాయూనివర్శిటీ, నాటి బిహెచ్‌పివి వంటి ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే కార్మికుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమార్గం చూపేవారన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమానికి నాయకత్వం

మిగతా 2లో..

కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన అవసరం

వర్క్‌షాప్‌లో వక్తలు

వర్క్‌షాపులో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అందరికీ న్యాయం అందించడం కోసం సమకాలీన, సాంకేతికతలకు అనుగుణంగా పలు అంశాలను పొందుపరిచి జులై 1 నుంచి దేశంలో అమలు కానున్న మూడు కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన అందరికీ అవసరమని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. విశాఖలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన దేశంలో జులై 1 నుంచి అమలులోకి రానున్న 3 క్రిమినల్ చట్టాలపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌నకు అదనపు డైరెక్టర్ జనరల్ (పిఐబి) రాజిందర్ చౌదరి అధ్యక్షత వహించారు. సమావేశంలో ఏపి రిటైర్డ్ ఐపిఎస్ అధికారి, మాజీ ఐజి ఆఫ్ పోలీస్ ఇ దామోదర్ ప్రసంగిస్తూ సవరించిన క్రిమినల్ చట్టాలు మారుతున్న కాలానికి అనుగుణంగా నవీకరించబడ్డాయన్నారు. క్రిమినల్ చట్టాల మైక్రో నైపుణ్యాలను కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సమాజానికి వాటి ఆచరణాత్మక ఉపయోగం చుట్టూ జరుగుతున్న నేరాల గురించి వివరించారు. కొత్త చట్టాల్లో పేర్కొన్న కమ్యూనిటీ సేవల శిక్షలు మనకు ఇంతకు పూర్వం పూర్తిగా తెలియనివి అన్నారు. కొత్త చట్టాల వర్తింపు నేరాలు, దానికి సంబంధించిన కేసులతో వ్యవహరిస్తున్నప్పుడు వాటిని ఎలా గ్రహించాలనే విషయంపై జోన్‌ల వారీగా రాష్ట్రంలో పోలీసు అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ నందిని సిపి మాట్లాడుతూ, మహిళలు, పిల్లలపై జరుగుతున్న నేరాలు, వాటి దర్యాప్తు ప్రక్రియ ఎఫ్‌ఐఆర్‌లు ఇతర

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

ఉంటారు. ప్రతి రౌండ్ లెక్కింపునకూ సగటున అరగంట పడుతుందని అంచనా. ప్రతి రౌండ్‌కూ 14 టేబుళ్ల చొప్పున లెక్కింపు జరగనుంది. చోడవరం నియోజకవర్గంలోని 243 పోలింగ్ కేంద్రాల లెక్కింపు 17 రౌండ్లు పూర్తిగానూ, చివరి రౌండ్‌లో ఐదు పోలింగ్ కేంద్రాల ఓట్లు లెక్కించనున్నారు. మాడుగులలో 235 పోలింగ్ కేంద్రాల ఓట్లను 16 రౌండ్లలో పూర్తిగానూ, 17వ రౌండ్‌లో మిగిలిన 11 కేంద్రాల ఓట్లు లెక్కిస్తారు. అనకాపల్లిలో 251 పోలింగ్ కేంద్రాల ఓట్లను 17 రౌండ్లలో పూర్తిగానూ, 18వ రౌండ్‌లో 13 పోలింగ్ కేంద్రాల ఓట్లను, యలమంచిలిలో 246 పోలింగ్ కేంద్రాల ఓట్లను 17 రౌండ్లలో పూర్తిగానూ, 18వ రౌండ్‌లో ఎనిమిది కేంద్రాల ఓట్లను, పాయకరావుపేటలో 292 పోలింగ్ కేంద్రాల ఓట్లను 20 రౌండ్లలో పూర్తిగానూ, 21 రౌండ్‌లో 12 కేంద్రాల ఓట్లను, నర్సీపట్నంలో 262 పోలింగ్ కేంద్రాల ఓట్లను 18 రౌండ్లలో పూర్తిగానూ, 19వ రౌండ్‌లో మిగిలిన పది కేంద్రాల ఓట్లను లెక్కించనున్నారు. మాడుగులలో తక్కువ పోలింగ్ కేంద్రాలు ఉండడంతో తొలుత ఈ ఫలితం వచ్చే అవకాశముంది.

జలాశయాలు విలవిల

పెద్ద తేడాలేనప్పటికీ, పెద్దేరు జలాశయంలో గతేడాది కంటే రెండు మీటర్ల నీరు ఎక్కువగా ఉంది.

తాండవ, రైవాడ, కోనాం, వరహా, పెద్దేరు జలాశయాల కింద 84,763 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాలు ఈ ఏడాది ఆశాజనకంగా పడకపోతే, ఖరీఫ్‌లో రైతులకు ఇబ్బందులు తప్పేలాలేవు.

కార్మిక సమస్యలపై 'పర్సా' నిరంతర పోరాటం

వహించారన్నారు. అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టాలు, కార్మిక హక్కులు అమలు కోసం ఉద్యమాలు చేపట్టారన్నారు. నేడు కేంద్ర బిజెపి, రాష్ట్ర వైసిపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను, కార్మిక వ్యతిరేక విధానాలపై నిఖరంగా పోరాడటమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు.

తులసి మరణానికి సంతాపం

విశాఖపట్నం జిల్లా అంగన్‌వాడీ ఉద్యోగుల యూనియన్‌కు అధ్యక్షులుగా పనిచేసిన వై.తులసి మంగళవారం గుండెపోటుతో మరణించడం పట్ల సిఐటియు విశాఖ జిల్లా కమిటీ సంతాపం తెలియజేసింది. ఈ సందర్భంగా ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలపై గత, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో తులసి మిలిటెంట్ పోరాటాలు నిర్వహించారన్నారు. ఆమె మరణం యూనియన్‌కే కాక మొత్తం కార్మికవర్గానికే తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.మణి, ఎస్.జ్యోతీశ్వరరావు, బి.జగన్, ఎం.సుబ్బారావు, పి.వెంకటరెడ్డి, యు.రామస్వామి, యు.రాజు, పి.అనసూయ, బి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన అవసరం

ఫిర్యాదుల ద్వారా నేరాల నమోదు అరెస్టులు, కస్టడీ, బెయిల్, శిక్షకు సంబంధించిన విధానం బాధితుల ప్రకటిత నేరస్తుల అంశాలపై ప్రసంగించారు. ఈ క్రమంలోనే డిజిటల్ ఎలక్ట్రానిక్ సాక్ష్యాలు, కంప్యూటర్, కమ్యూనికేషన్ పరికరాల ప్రధాన అంశాలలో నేరాన్ని నిర్ణయించే క్రమంలో రుజువుల ప్రమాణంగా తీర్పులు ఆమోదించే సమయంలో ఒప్పుకునే రికార్డు చేయడం కూడా ప్రాధాన్యతతో కూడుకున్నదని ఆమె చెప్పారు. ఈ కొత్త క్రిమినల్ చట్టాల ప్రవేశంతో సాక్ష్యాలు ఒక ప్రాంతానికో ఒక ప్రదేశానికో పరిమితం కాకుండా కీలకపాత్ర పోషించనున్నాయని తెలిపారు. వర్క్‌షాప్‌నకు అధ్యక్షత వహించిన రాజేందర్ చౌదరి మాట్లాడుతూ, పత్రికా సమాచార కార్యాలయం, ప్రభుత్వానికి సంబంధించిన సమాచారాన్ని మీడియా ద్వారా ప్రజలకు అందించడంలో దాని పాత్రను పరిచయం చేశారు. బాధిత వ్యక్తుల హక్కులను పరిరక్షించడం, నేరాల విచారణను సమర్థవంతంగా నిర్వహించడానికి కొత్త క్రిమినల్ చట్టాలకు మెరుగులు దిద్దినట్లు తెలిపారు. దేశ నేర న్యాయ వ్యవస్థను పూర్తిగా మార్చేందుకు జులై 1 నుంచి ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి 1860), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి) 1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872లను కొత్త అంశాలతో రూపొందించి అమలు చేయనున్నట్లు తెలిపారు.

పాత నగరంలో పోలీసుల మార్చ్ ఫాస్ట్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో విశాఖ పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాలతో పాత నగరంలో పోలీసులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. పలు ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ చేపట్టారు. సమస్యాత్మక ప్రాంతాల్ని గుర్తించేందుకు పారా మిలటరీ దళాల సాయాన్ని తీసుకున్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాణిబొమ్మ జంక్షన్, 29వ వార్డులోని ఎంవిడిఎం హైస్కూల్, 39వ వార్డు చిలకపేట, ఉడ్ యార్డ్ వీధి, కొత్తరోడ్డు, వెలంపేట, పండా వీధి, ప్రసాద్ గార్డెన్స్, పూర్ణా మార్కెట్ ఏరియాల్లో గస్తీ కాశారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని సిఐ భాస్కర్, ఎస్ఐ పురుషోత్తం, ఎఎస్ఐ వెంకటలక్ష్మి కోరారు.

కౌంటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో ఎయు ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో వచ్చే నెల 4న నిర్వహించబోయే ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని రిటర్నింగ్ అధికారులకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటర్నింగ్ అధికారులు అత్యంత జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. కౌంటింగ్ ఏర్పాట్లపై అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులతో సమావేశం ఏర్పాటుచేసి కౌంటింగ్ ఏర్పాట్లకు చేపడుతున్న చర్యలు గురించి వివరంగా తెలియజేయడం ద్వారా వారిలో ఉండే అపోహలు తొలగించాలన్నారు. కౌటింగ్ సెంటర్ల వద్ద సి సి కెమెరాలు, బారికేడ్లు, కౌటింగ్ హాలులో టేబుళ్ల ఏర్పాటు, రాజకీయ పార్టీల ఏజెంట్లకు ఐడెంటిటీ కార్డుల మంజూరు గురించి రిటర్నింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 31వ తేదీ సాయంత్రానికి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేయాలన్నారు. కౌటింగ్ విధుల సిబ్బంది మొదటి విడత రేండమైజేషన్ ఈ నెల 25న, రెండో విడత రేండమైజేషన్ జూన్ 2న నిర్వహించనున్నట్లు తెలిపారు. కౌంటింగ్ విధుల నిర్వహించే సిబ్బందికి ఈ నెల 27న ట్రైనింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జివిఎంసి ఎడిసి కెఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, రెవిన్యూ డివిజనల్ అధికారులు హుస్సేన్ సాహెబ్, కె.భాస్కర్‌రెడ్డి, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత పరిశీలన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కల్పించిన భద్రతను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బుధవారం సాయంత్రం పరిశీలించారు. రోజువారీ తనిఖీలో భాగంగా పార్లమెంటు నియోజకవర్గం స్ట్రాంగ్ రూమ్‌తో పాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌లను పోలీసు జాయింట్ కమిషనర్ ఫక్కీరప్ప, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్‌తో కలిసి తనిఖీ చేశారు. ప్రతి గదికీ వేసిన తాళాలను, సీళ్లను పరిశీలించారు. భద్రతా సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అనంతరం ఓట్ల లెక్కింపు రోజున మీడియాకు ఫలితాల వివరాలను అందించేందుకు గాను మీడియా సెంటర్ ఏర్పాటు చేయనున్న క్రమంలో సంబంధిత భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు.

కార్యకర్తల కష్టాన్ని మరవను : వాసుపల్లి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తల కష్టాన్ని ఎప్పటికీ మరవనని దక్షిణ నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ఆశీలమెట్ట కార్యాలయంలో బుధవారం కార్యకర్తలు, నాయకులతో సమావేశమై మాట్లాడారు. నియోజకవర్గంలో ఎల్లప్పుడూ కార్యకర్తల మధ్యలో ఉంటూ వారి సమస్యను తన సమస్యగా భావిస్తూ ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. ఈ ఎన్నికల్లో తాను ప్రచారాలకు బిజీగా ఉంటే మిగతా కార్యక్రమాలలో వెనకుండి సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు ఇన్చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీలంకకు ఇండియన్ ఆయిల్ ప్రీమియం ఇంధనం ఎగుమతి

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : ఇండియన్ ఆయిల్ ప్రీమియం ఇంధనం ఎక్స్‌పి100ని శ్రీలంకకు ఎగుమతి చేస్తుందని ఇండియన్ ఆయిల్ డైరెక్టర్ (మార్కెటింగ్) వి.సతీష్ కుమార్ తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, నవీ ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్ (జెఎన్‌పిటి) నుంచి సుపీరియర్ 100 ఆక్టేన్ ప్రీమియం ఇంధనం, ఎక్స్‌పి 100ని మొట్టమొదటిసారిగా ఎగుమతి చేసిందన్నారు. ఈ ఇంధనం హై ఎండ్ వాహనాల కోసం రూపొందించామన్నారు. ఎక్స్‌పి100 శ్రీలంకలోని తమ కస్టమర్లకు అత్యుత్తమ పనితీరును అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. తమ ఈ ఉత్పత్తి శ్రీలంకలో కొత్త మార్కెట్‌ను జయించటానికి దోహద పడుతుందని తెలిపారు. భారతదేశం మొదటిసారి 100 ఆక్టేన్ పెట్రోల్ ఎక్స్‌పి100 దేశీయంగా అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. హై ఎండ్ వాహనాల కోసం రూపొందించిన ఎక్స్‌పి100లో అసాధారణమైన యాంటీ నాక్ లక్షణాలు ఉన్నాయని, ఇంజిన్ పనితీరు, సున్నితమైన డ్రైవబిలిటీ, మెరుగైన ఇంధనం దీని ప్రత్యేకత అని తెలిపారు.

అమెజాన్‌తో విశాఖ అటవీశాఖ ఒప్పందం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అమెజాన్ ఇండియాతో విశాఖ జిల్లా అటవీశాఖ కలిసి మంగళవారం 'కరిగార్' పేరిట భాగస్వామ్యం కుదుర్చుకుందని జిల్లా అటవీ శాఖ అధికారు అనంత్ శంకర్ తెలిపారు. గిరిజనులను మరింతగా ప్రోత్సహించేందుకు, ఆన్‌లైన్‌లో గిరిజన ఉత్పత్తులు విక్రయించేలా 'కరిగార్' ఉపయోగపడనుందని పేర్కొన్నారు. అమెజాన్ ఈ-కామర్స్ వేదికగా కంబాల కొండ సమీప శంభువానిపాలెం సంస్కృతి, సంప్రదాయాల్ని కాపాడే ప్రయత్నం చేస్తోందన్నారు. అటవీశాఖ కూడా ఈ కామర్స్ హబ్ ఏర్పాటు చేయనుందని వివరించారు. ప్యాకేజింగ్, స్టోరేజీ, డిస్పాచ్, ఆర్డర్ ప్రాసెసింగ్ అంశాల్ని అమెజాన్‌కు కేటాయించనున్నట్లు తెలిపారు. ఆవు పిడకలతో పాటు పేపర్ మాస్క్, గిరిజన కళాత్మక వస్తు సామగ్రి, కొబ్బరి, వెదురు ఉత్పత్తుల్ని ఈ వేదికగా అటవీశాఖ అమెజాన్ ద్వారా ప్రపంచానికి తెలియజేయనుందని వివరించారు.

రైళ్లకు నూతన ఎల్‌హెచ్‌బి కోచ్‌లు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు విశాఖపట్నం- ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం- పారాదీప్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం-కర్నూల్ టౌన్ సమ్మర్ స్పెషల్ ట్రైన్‌లను ఆధునిక లింక్ హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బి) తో సంప్రదాయ కోచ్‌లుగా మార్చాలని రైల్వే నిర్ణయించింది. ఈ క్రమంలో ఈ నెల 24 నుండి 22801 విశాఖపట్నం- ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 25 నుండి 22802 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-విశాఖపట్నం వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 26 నుండి 22810 విశాఖపట్నం- పారాదీప్ వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 27 నుండి 22809 పారాదీప్-విశాఖపట్నం వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 28 నుండి 08585 విశాఖపట్నం-కర్నూల్ టౌన్ సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 29 నుండి 08586 కర్నూలు టౌన్-విశాఖపట్నం సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లు నూతన ఎల్‌హెచ్‌బి రేక్‌తో నడవనున్నాయని రైల్వే శాఖ సీనియర్ డిసిఎం కె.సందీప్ తెలిపారు.

ఎయును సందర్శించిన పిసిసిఎఫ్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి చౌదరి బుధవారం సందర్శించారు. ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డితో ఆయన చాంబర్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో అభివృద్ధి, వర్సిటీ నలుమూలాలా స్థాపించిన టెక్, ఫార్మా, ఫుడ్, మెరైన్, ఇంక్యుబేషన్ కేంద్రాల పనితీరు, ప్రగతిని విసి వివరించారు. ఈ సందర్భంగా ఎయు తరఫునచిరంజీవి చౌదరిని సత్కరించారు. కార్యక్రమంలో ఏపి బయోడైవర్సిటీ బోర్డ్ అధికారులు పాల్గొన్నారు.

డిజైన్ థింకింగ్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఎంపిక చేసిన పాఠశాలల్లో మొట్టమొదటి డిజైన్ థింకింగ్, ట్రైనింగ్ వర్క్‌షాప్‌ను శామ్‌సంగ్ ప్రవేశపెట్టింది. శామ్‌సంగ్ యొక్క 'సాల్వ్ ఫర్ టుమారో' ప్రోగ్రామ్‌లో భాగమైన, మానవ-కేంద్రీకృత డిజైన్ థింకింగ్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా విద్యార్థుల్లో సమస్య-పరిష్కార, విమర్శనాత్మక ఆలోచన, పరిశీలన సృజనాత్మకత వంటి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంపై లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ రీజినల్ కో-ఆర్డినేటర్ ఎస్‌పి.చున్ తెలిపారు. బీచ్ రోడ్‌లోని వెల్కం హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, చిన్నారుల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన ఈ వన్-డే కోర్సు డిజైన్ థింకింగ్ భావనకు విలువనిచ్చేలా ప్రేరేపించడం, వాస్తవ సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు.

240 కేంద్రాలలో బైజూస్ కొత్త బ్యాచ్‌లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : 2024-25 అకడమిక్ సెషన్ కోసం 240 స్థానాల్లో నూతన బ్యాచ్‌లను ప్రారంభించాయని బైజూస్ సంస్థ ప్రతినిధి బైజు రవీంద్రన్ తెలిపారు. సిరిపురంలోని బైజూస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బైజూస్ ట్యూషన్ సెంటర్లు విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రోగ్రామ్‌లను అందిస్తాయని చెప్పారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి బైజూస్ బిటిసిలకు వార్షిక రుసుమును రూ.36 వేలుకు తగ్గించిందని తెలిపారు.

IN THE HONOURABLE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE, SRIKAKULAM
E.P.NO. 46/2023 in A.C.P. 307/2019

Between: **MARGADARSI CHIT FUND PRIVATE LIMITED.** SRIKAKULAM BRANCH, ...DECREE HOLDER
And: **BODDEPALLI VENUGOPALA RAO AND OTHERS** ...JUDGEMENT DEBTORS
TO:
JDR:NO.3 YENNI JAGAN KUMAR, S/O.SATYAM, W/AS SR. GOODS GUARD, WHY/WALTAIR, E.CO.RAILWAY, VISAKAPATNAM DIST., R/AT D.NO.13-163, INDIRANAGAR, GOPALAPATNAM, VISAKAPATNAM DISTRICT.

Please take notice that the above decree holder filed the above Execution petition for realisation of the Execution Petition amount etc., by way of SALARIES etc., for an amount of Rs. 8,97,361/- Under Order 21, Rule 48 of C.P.C.

You are hereby directed to appear before the above said Hon'ble court in person or by an Advocate duly authorized on **04-07-2024 at 10-30 A.M.** failing which exparty orders willbe passed against you and the matter willbe decided in your absence.

(BY ORDER OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, SRIKAKULAM)

PUDI RAMBABU
Advocate for Decree Holder, Srikakulam.

మాస్టర్ ప్లాన్ రోడ్లకు మోక్షమెప్పుడో.!

విస్తరణకు నోచుకోని భీమిలి మెయిన్ రోడ్డు

- ఏడు రోడ్ల విస్తరణకు ప్రభుత్వాల ఆమోదం
- ఏళ్లుగడుస్తున్నా కార్యరూపం దాల్చని ప్రతిపాదనలు
- ఇరుకు రోడ్లతో జనం, వాహనదారుల అవస్థలు
- నిధుల లభ్యత లేకనే ముందుకు కదలని పనులు?

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో ఏడు చోట్ల రోడ్ల విస్తరణకు నేటికీ మోక్షం లభించడం లేదు. కొన్నేళ్ల క్రితం చేసిన ప్రతిపాదనలు నేటికీ కార్య రూపం దాల్చలేదు. భీమిలి పోలీస్‌స్టేషన్ నుంచి తగరపువలస జంక్షన్ వరకు ప్రస్తుతమున్న 40 నుంచి 60 అడుగుల వెడల్పున్న రోడ్డును 80 అడుగుల వెడల్పునకు విస్తరించాలని అధికారులు చేసిన ప్రతిపాదనలు చేయగా, 2019లోనే

అప్పటి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. స్థానిక పోలీస్ స్టేషన్ వై జంక్షన్ నుంచి దొరతోట రోడ్డు, జెవి అగ్రహారం వరకు ఇప్పుడున్న సుమారు 40 అడుగుల రోడ్డును 100 అడుగుల వెడల్పు విస్తరించాలని అధికారులు చేసిన ప్రతిపాదనలను 2018 లో అప్పటి ప్రభుత్వం ఆమోదం తెలిపింది

ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ఇప్పుడున్న 25 నుంచి 30 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డును 66 అడుగుల మేర వెడల్పు చేయాలని 2015లో అప్పటి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎస్‌బిఐ నుంచి బీచ్ రోడ్డు మీదుగా జెడ్‌పి గెస్ట్ హౌస్ వరకు ఇప్పుడున్న 20 నుంచి 30 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డును 60 అడుగుల వెడల్పు చేయాల్సి ఉంది. దీనికి కూడా 2015లోనే అప్పటి ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి గంటస్తంభం వరకు ఇప్పుడున్న సుమారు 20 నుంచి 25 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డును 66అడుగుల మేర వెడల్పు చేయాలని 2015లో అప్పటి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గంట స్తంభం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ఇప్పుడున్న సుమారు 30 నుంచి 40 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డును 66 అడుగుల మేర వెడల్పు చేయాలని సంబంధిత అధికారులు చేసిన ప్రతిపాదనలకు 2015 లోనే అప్పటి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గతంలో వుడా, ప్రస్తుత విఎంఆర్‌డిఎ, ఆర్‌అండ్‌బి, జివిఎ సి ఇలా వివిధ విభాగాల అధికారులు మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి నిర్ధిష్ట ప్రణాళికలు సిద్ధం చేసి ప్రతిపాదనలు రూపొందించారు. ఇలా రోడ్లను అభివద్ధి చేస్తే ట్రాఫిక్ నియంత్రణ మొదలు, పట్టణ స్వరూపమే మారనుందన్న దూరదృష్టితో ప్రణాళికలు రచించారు. వాటికి ప్రభుత్వాల ఆమోదం లభించినా, పనుల్లోనే కదలిక లేకపోవడం విశేషం. రోజురోజుకూ పెరుగుతున్న ప్రజల అవసరాలు, జనాభా దృష్ట్యా పట్టణాలు, నగరాల్లో రోడ్ల విస్తరణ, అభివృద్ధి అవసరమే.

సమృద్ధిగా నిధులు లేకనే,?

సమృద్ధిగా నిధులు లేకనే మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి నేటికీ కార్య రూపం దాల్చలేదని చెప్పవచ్చు. రోడ్లు విస్తరణ చేసే క్రమంలో ఏళ్ల తరబడి ఉపాధి పొందుతున్న చిరు వ్యాపారులకు, నివాసాలు కోల్పోయిన వారికి మెరుగైన పరిహారం చెల్లించాల్సి ఉంది. రోడ్ల అభివృద్ధి కి, నిర్వాసితులకు పరిహారం చెల్లింపునకు సమద్ధిగా నిధులు అవసరం. రోడ్ల అభివృద్ధికి ఎంత ప్రాధాన్యం ఉందో,నిర్వాసితులకు పరిహారం చెల్లింపు లోనూ అంతే ప్రాధాన్యం ఇమిడి ఉంది

రోడ్ల అభివృద్ధి అవసరమే..

1861 ఫిబ్రవరి 9న ఏర్పడిన చారిత్రక భీమునిపట్నం పురపాలక సంఘం, జివిఎంసిలో విలీనం అయినప్పటికీ, ఆశించిన స్థాయిలో అభివద్ధి జరగలేదనేది సుస్పష్టం. జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో ప్రస్తుతం 86,519 జనాభా ఉన్నారు.58.14 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి ఉంది. 52 మురికి వాడలు ఉన్నాయి. 37 మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి అవసరమని ప్రభుత్వాలు గుర్తించాయి.అయితే నిధుల లభ్యత ఆధారంగా తక్షణం ఏడు మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి అవసరమని అధికారులు చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వాలు ఇప్పటికే ఆమోదం తెలిపాయి. అయితే కార్యరూపంలోకి రాలేదు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో ఎండపల్లి గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సైకిలిస్ట్ మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ రమణయ్య తెలిపారు. ఎండపల్లి గ్రామానికి చెందిన గుడివాడ అప్పలనాయుడు (46) పొలం పనులు ముగించుకుని సైకిలుపై ఇంటికి వస్తుండగా, ప్రధాన రహదారిపై వెనక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయమై మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తెలగా సంక్షేమ సేవా సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస తెలగ సంక్షేమ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా రంగూరి సీతారామదొర (రాంబాబు), కార్యదర్శిగా నార్ల వాసు, సంయుక్త కార్యదర్శిగా తమ్మిన సూర్యప్రకాష్ ఎన్నికయ్యారు. స్థానిక సంఘం పెద్దలు అల్లు బాబూరావు, సుంకర రాంప్రసాద్, రంగూరి రామ్ కుమార్, నక్కాన గోవింద్, సాధు సుందర్ సింగ్ పాల్గొన్నారు

నూతన వస్త్ర షోరూం ప్రారంభం

వస్త్ర షోరూం ప్రారంభిస్తున్న సందీప్

ప్రజాశక్తి -ఆనందపురం: అనందపురం జంక్షన్ మహాత్మాగాంధీ పూల మార్కెట్ వద్ద లోకల్‌బాయ్ న్యూ ఫ్రెండ్స్ షోరూమ్‌ను భీమిలి నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల, భీమిలి ఎమ్మెల్యే స్వతంత్ర అభ్యర్థి నాగమణి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ప్రతిఒక్కరూ స్వతహాగా అభివృద్ధి చెందడంతోపాటు, నలుగురికి ఉపాధి కల్పించే విధంగా ఆదర్శంగా నిలవాలని సూచించారు. వస్త్రవ్యాపారం దిగ్విజయంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రొప్రైటర్ పండు, మండల ప్రెసిడెంట్ తమ్మిన అప్పలరాజు, జాన కృష్ణ, ప్రశాంత్‌కుమార్ నాయుడు పాల్గొన్నారు.

నేడు సచివాలయాల్లో బిసిజి వ్యాక్సినేషన్

ప్రజాశక్తి -మధురవాడ : క్షయవ్యాధి సమగ్ర నిర్మూలనే లక్ష్యంగా గురువారం మధురవాడ పిహెచ్‌సి పరిధిలోని అన్ని వార్డు సచివాలయాల్లో బిసిజి వ్యాక్సిన్ వేస్తామని టిబి యూనిట్ ల్యాబ్ పర్యవేక్షకుడు వీరబ్రహ్మం తెలిపారు. సాగర్‌నగర్, రుషికొండ, పిఎంపాలెం, వాంబేకాలనీ, స్వతంత్రనగర్ కాలనీ, మిథిలాపురి వుడాకాలనీ, విశాలాక్షినగర్, మారికివలస, బక్కన్నపాలెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలోనూ అర్హులకు బిసిజి వ్యాక్సిన్ వేస్తారన్నారు. ఆనందపురం మండలంలోని సచివాలయాలతో పాటు, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లలో బిసిజి వ్యాక్సినేషన్ జరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జీవ వైవిధ్య ప్రణాళికలో భాగస్వాములు కండి

ప్రజాశక్తి-సీతమ్మధార: జీవ వైవిధ్య ప్రణాళికలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కృష్ణ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి సుంకరి రామకృష్ణారావు కోరారు. మంగళవారం పౌర గ్రంథాలయంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా యాక్షన్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడు తూ,. గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్‌వర్క్ అమలుకు మద్దతు ఇవ్వడం ద్వారా జీవవైవిధ్య నష్టం నియం త్రణకు సహకరించాలన్నారు. జీవవైవిధ్య పరిరక్షణకు ప్రతిఒక్కరూ కనీసం 10 మొక్కలు నాటి, పెంచే కార్యక్రమాన్ని ఈరోజే మొదలెట్టాలని కోరారు. జీవ వైవిధ్య ప్రణాళిక అమలుకు మద్దతునిచ్చే మార్గాలను మెరుగుపరచడానికి అందరూ ప్రోత్సహించా లన్నారు.

జీవవైవిధ్య ప్రణాళిక బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఎవిఎన్ డిగ్రీ కాలేజీ జువాలజీ లెక్చరర్ అర్చన మాట్లాడుతూ మానవ భవిష్యత్తు ఆహార కేంద్రం సముద్రంలోని జీవరాశిని కాపాడటం అందరి బాధ్యత అన్నారు.. దాదాపు 3 బిలియన్ల ప్రజలకు చేపలు ద్వారా 20 శాతం జంతు ప్రోటీన్ లభిస్తే, మానవుల ఆహారంలో 80 శాతానికి పైగా మొక్కల ద్వారానే లభిస్తోందని వివరించారు. నడుపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షణ ప్రణాళికలో విద్యార్థులను భాగస్వాములు చేస్తున్నామన్నారు.హరిత విద్యార్థులను తయారు చేస్తున్నానని చెప్పడానికి గర్వంగా ఉందన్నారు.. సిఫా ట్రస్ట్ సిఇఒ డాక్టర్ శశిప్రభ మాట్లాడుతూ రాష్ట్రంలో 14వేల మంది విద్యార్థులకు గ్రీన్ అంబాసిడర్స్‌గా శిక్షణ ఇచ్చామన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 80 శాతం గ్రామీణ ప్రజలు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కోసం సాంప్రదాయ మొక్కల ఆధారిత మందులపై ఆధారపడుతున్నారన్నారు.యాక్షన్ ఎయిడ్ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇర్ఫాన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా తమ సంస్థ పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులు, విపత్తుల సమయంలో బాధితులకు చేయూతనిచ్చే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.మురళీనగర్ గార్డెనింగ్ ప్రతినిధులు ఉదయ్ కుమార్, మళ్ల సరిత, యువ సేవాసంస్థ ప్రతినిధి హరి, పీపుల్స్ పవర్ సంస్థ ప్రతినిధి భాస్కర్, టీచర్ పంతులు లలిత, ఎస్ఎఫ్ఎస్ విద్యా సంస్థ ఉపాధ్యాయులు శివలక్ష్మి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, యాక్షన్ ఎయిడ్ ఫెలోషిప్ ప్రతినిధులు కృష్ణకుమారి, ఇందు మాట్లాడారు

జీవ వైవిధ్యాన్ని పరిరక్షించాలి

ములగాడ : ప్రకృతిలోని ప్రతి జీవి ప్రముఖమైనదేనని, వాటిని పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందని ఎన్ఎస్ఎస్ సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి అన్నారు. బుధవారం మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జీవవైవిధ్య దినోత్సవంపై మాట్లాడారు. సృష్టిలో ఉత్పత్తిదారులు, వినియోగ దారులు, విచ్ఛిన్నకారులు అని మూడు రకాల జీవులు ఉన్నాయని, అవి ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయన్నారు. జీవ వైవిధ్యం దెబ్బతింటే వాతావరణంలో మార్పులు సంభవిస్తాయన్నారు.

ఈ సందర్భంగా వివిధ రకాల కళాకృతులు, బొకేల తయారీలో చిన్నారులకు శిక్షణనిచ్చారు. బారిష్టర్ పార్వతీశం నవలను రచయిత కె. సత్తిరాజు చిన్నారులకు పరిచయం చేశారు. అంతకుముందు రాజా రామ్మోహన్‌రాయ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్ పూలమాలను వేసి అంజలి ఘటించారు.

యథేచ్ఛగా మట్టి దందా!

- ఇటుక బట్టీలకు తరలిపోతున్న పొలాల్లోని మట్టి
- రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్న దళారులు
- సమాచారం లేదని పట్టించుకోని అధికారులు

జెసిబి, ట్రాక్టర్ల సాయంతో తరలిస్తున్న పొలాల్లోని మట్టి

ప్రజాశక్తి -అనందపురం : గ్రామీణ ప్రాంతాల్లో మట్టిదందాకు అడ్డూఅదుపూ లేకుండా పోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పంట పొలాల్లో సారవంతమైన మట్టిని అక్రమంగా ఇటుక బట్టీలకు తరలించి, దళారులు లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు వివరాల్లోకి వెళితే...

మండలంలో భీమన్న దొరపాలెం పంచాయతీ కోలవానిపాలెం, పప్పలవానిపాలెం చెరువు పొలం మట్టిని రెండు రోజుల నుంచి రెండు జెసిబిలు తవ్వి, 15 లారీలతో రవాణా చేసుకొని ఇటుక బట్టీలకు విక్రయిస్తున్నారు. తద్వారా పొలాల్లోని సారవంతమైన మట్టి గుల్లకాగా, దళారులకు కాసుల పంట పండిస్తోందని ఆరోపణలున్నాయి. ఒక్కొక్క లారీ మట్టిని రూ.2500 నుంచి రూ.3000 వరకు అమ్ముతున్నట్లు సమాచారం.దీనిపై సంబంధిత విఆర్‌ఒను వివరణ కోరగా, తమకు ఎటువంటి సమాచారం లేదని,ఏమైనా జరిగితే వెంటనే చర్యలు తీసుకుంటామని అంటున్నాడు. రెండురోజులుగా రేయింబవళ్లు బాహాటంగానే మట్టిని తవ్వి, తరలించుకుపోతుంటే, తనకు సమాచారం లేదని విఆర్‌ఒ చెప్పడాన్ని పలువురు విస్తుపోతున్నారు.

సగం వేతనం చెల్లింపుపై ఉక్కు కార్మికుల నిరసన

- సిఎండి, డైరెక్టర్లను కలిసి వ్యతిరేకత వ్యక్తం చేసిన అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు
- కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీస్తే ఊరుకోబోమని యాజమాన్యానికి హెచ్చరిక

సమావేశంలో ఉక్కు అధికారులు, అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి -ఉక్కునగరం : ఉక్కు కార్మికులకు వేతనాలతోపాటు ఇతర రాయితీలు, ప్రయోజనాల చెల్లింపులో యాజమాన్యం అనుసరిస్తున్న అనుచిత, నిర్లక్ష్య వైఖరిని స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు.సగం వేతనం చెల్లించి చేతులు దులుపుకున్న యాజమాన్యం దుర్మార్గపు వైఖరిని నిరసిస్తూ ఉక్కు డెకికేషన్ పార్కులో వేలాది మంది కార్మికులు ఆందోళన చేపట్టారు. 21 రోజులు తర్వాత కార్మికులకు సగం వేతనాలు చెల్లించిన ఉక్కు అధికారుల తీరుపై మండిపడ్డారు. అనంతరం ఒక్కో యూనియన్ నుండి ఒక్కొక్కరు చొప్పున అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు సిఎండిని, డైరెక్టర్లను కలిసి కార్మికుల వ్యతిరేకతను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గతంలో స్టీల్‌ప్లాంట్ ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా కార్మికుల వేతనాలను, వారికి చెల్లించాల్సిన రాయితీలు, ఇతర ప్రయోజనాలను విస్మరించలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. ఉత్పత్తిపై దృష్టి సారించాలంటే కార్మికుల ప్రయోజనాలను దెబ్బ తీయకూడదన్న సత్యాన్ని ప్రస్తుత యాజమాన్యం గ్రహించాలని నిలదీసి ప్రశ్నించారు. డార్స్ స్థానంలో కొత్తగా ప్రవేశపెట్టిన బార్(బయోమెట్రిక్) వల్ల వస్తున్న ఇబ్బందులు, మెడికల్ పర్మిషన్, బ్యాంకు పర్మిషన్ వంటి అంశాలపై సిఎండి దృష్టికి తీసుకెళ్లి, దీనిపై అన్ని విభాగాల వర్క్స్ హెచ్ఒడిలకు నిర్దిష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఉద్యోగు లకు రావాల్సిన మిగతా సగం వేతనాన్ని ఈ రోజే చెల్లించాలంటూ పట్టుబట్టారు.

దీనిపై సిఎండి అతుల్‌భట్ స్పందిస్తూ, కార్మికులకు మిగతా సగం వేతనాన్ని గురువారం సాయంత్రంలోగా వేస్తామని భరోసానిచ్చారు. మెడికల్ పర్మిషన్ వెంటనే అమల్లోకి వస్తుందని, బ్యాంకు, ఇతర పర్మిషన్ల విధివిధానాలపై జూన్ ఒకటో తేదీనాటికి సర్కులర్ జారీ చేస్తామన్నారు. బయోమెట్రిక్ హాజరుకు సహకరించిన కార్మిక సంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి, ఇతర అంశాల్లో అందరం సమగ్ర విధానాలతో, సమిష్టిగా ముందుకు వెళితేనే విజయం సాధ్యమని సిఎండి పునరుద్ఘాటించారు. స్టీల్‌ప్లాంట్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభంపై ఆందోళన వ్యక్తం చేసిన సిఎండి, మున్ముందు పూర్తిస్థాయి ఉక్కు ఉత్పత్తితో దీన్ని అధిగమించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు.

అనంతరం ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ, స్టీల్ ఉత్పత్తికి కావాల్సిన ముడిసరుకును యాజమాన్యం సమకూరిస్తే, అంకితభావంతో పనిచేయడానికి కార్మికవర్గం సిద్ధంగా ఉందని భరోసానిచ్చారు.ఇదే సమయంలో కార్మికుల ప్రయోజనాలను యాజమాన్యం విస్మరించరాదని హెచ్చరించారు. వచ్చేనెల వేతనాలు సకాలంలో చెల్లించకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని యాజమాన్యాన్ని అఖిలపక్ష కార్మిక సంఘాలు హెచ్చరించాయి.

సమావేశంలో సిఎండి అతుల్‌భట్‌తోపాటు హెచ్ఆర్, ఆపరేషన్స్, ఫైనాన్స్, కమర్షియల్ విభాగాల డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లుతోపాటు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, విల్లా మోహన్ కుమార్, డి. అప్పారావు, కొమ్మినేని శ్రీనివాస్, డేవిడ్, జీవీ రమణారెడ్డి, శ్రీనివాస్ నాయుడు, మహాలక్ష్మి నాయుడు, సిహెచ్ సన్యాసిరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయ సాధనకు కృషి

సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి-పెందుర్తి : సిపిఎం వ్యవస్థాపక కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సిఐటియు నేతలు పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య 39వ వర్ధంతి పురస్కరించుకొని స్లీపర్ కంపెనీ వద్ద ఆయన చిత్రపటానికి సిఐటియు నేత శంకరరావు పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1913లో నెల్లూరు జిల్లా అలగానిపాడులో జన్మించిన పుచ్చలపల్లి సుందరయ్య, కమ్యూనిస్టు పార్టీలో చేరి స్వాతంత్రోద్యమంలో పాల్గొని జైలుకెళ్లారన్నారు. దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించి, తెలంగాణలో నైజాం నవాబ్‌కు వ్యతిరేకంగా రైతాంగ పోరాటం చేసి పదివేల ఎకరాల భూమిని పేదలకు పంచారన్నారు. ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేసిన సుందరయ్య, చట్టసభలకు సైకిల్‌పై వెళ్లిన నిరాడంబరుడు, నిస్వార్థపరుడని కొనియాడారు .కార్యక్రమంలో సిఐటియు నాయకులు అప్పలనాయుడు, ఆంజినేయులు పాల్గొన్నారు

చిరుధాన్యాలతో బుద్ధుని చిత్రపటం

బుద్ధుని చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న బౌద్ధభిక్షువులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : బుద్ధపూర్ణిమను పురస్కరించుకుని నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయకుమార్ మిల్లెట్స్‌తో ప్రత్యేకంగా నాలుగు అడుగులు ఎత్తు, మూడు అడుగుల వెడల్పుతో రూపొందించిన బుద్ధుని చిత్రపటాన్ని బుధవారం ఎంవిపి కాలనీలోని ఏయు అంతర్జాతీయ విద్యార్థినుల వసతిగృహంలో బౌద్ధ భిక్షువుల సమక్షంలో ఆవిష్కరించారు. చిత్రకారుడు తీర్చిదిద్దారు. ఈ చిత్రపటాన్ని కేవలం మిల్లెట్స్ ఉపయోగించి 20 రోజులు శ్రమించి తయారు చేశారు. మోకా విజయకుమార్ 20రోజులు శ్రమించి దీన్ని తయారుచేశారు. అనంతరం బౌద్ధ భిక్షువులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మిల్లెట్స్ ఉపయోగించి ఎంతో కళాత్మకంగా సహజత్వం తొణికిసలాడేలా బుద్ధుని చిత్రపటాన్ని తీర్చిదిద్దిన చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ విద్యార్థుల హాస్టల్ చీఫ్ వార్డెన్ ఆచార్య ఈశ్వర్‌కుమార్, మహిళా హాస్టల్ వార్డెన్ డాక్టర్ కె.రాజామాణిక్యం పాల్గొన్నారు. గౌతమ బుద్ధుని చిత్రపటాన్ని తమతో ఆవిష్కరింపజేయడంపై బౌద్ధ భిక్షువులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

సీదిరిని పరామర్శించిన జియ్యాని

మంత్రి అప్పలరాజుతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

ప్రజాశక్తి- వేపగుంట : అనారోగ్యంతో బాధపడుతున్న కుమారుడికి మెరుగైన వైద్యం అందించేందుకు నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించిన మంత్రి సీదిరి అప్పలరాజును నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ బుధవారం పరామర్శించారు. ఆసుపత్రికి వెళ్లి, సీదిరి అప్పలరాజును కలిసిన జియ్యాని, అతని కుమారుడి ఆరోగ్య పరిస్థితి,అందుతున్న వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సీదిరి అప్పలరాజును పరామర్శించిన వారిలో విశాఖ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ కృష్ణ ఉన్నారు.

జోనల్ కార్యాలయ పునర్నిర్మాణం వేగవంతం

ఇంజినీరింగ్ అధికారులకు జివిఎంసి కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఆదేశం

అధికారులకు సూచనలు చేస్తున్న జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి-పిఎం పాలెం: జివిఎంసి రెండవ జోనల్ కార్యాలయం పునర్నిర్మాణం, ఆధునికీకరణ పనులు వేగవంతం చేయాలని జివిఎంసి కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మధురవాడలోని జోన్-2 కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న కార్యాలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు.కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించి, కార్యాలయమంతా ఆకర్షణీయమైన ఆకృతులతో నిర్మాణం చేపట్టి, అధునాతన ఫర్నిచర్, విద్యుత్తు, కేబుల్ వైర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యాలయం పక్కన ఉన్న సౌకర్య కేంద్రం (సిటిజన్ సర్వీస్ సెంటర్)ను పరిశీలించి నిత్యం పరిశు భ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఐటి సెజ్ వద్ద ఆదిత్య అపార్టుమెంట్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఐటి సెజ్ పార్కును సందర్శించారు. పార్కులోని పనులను, సమీపంలోని టెన్నిస్ కోర్టు పార్కు పనులను త్వరతగతిన పూర్తి చేయాలని జివిఎంసి ఎస్ఇ శాంసన్ రాజు, ఇఇ శాంతిరాజ్‌లను ఆదేశించారు. ఐటి సెజ్ రోడ్లపై ఉన్న అనధికార బడ్డీలను వెంటనే తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశించారు.పర్యటనలో ఎడిహెచ్ సురేష్, ఎఎంహెచ్ఒ డాక్టర్ కిషోర్, డిఇఇ వంశీ, ఎఇఇ శ్రీధర్ పాల్గొన్నారు.

కూటమి లీగల్ సెల్‌కు మార్గనిర్దేశనం

వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న లీగల్ సెల్ న్యాయవాదులు

ప్రజాశక్తి- లీగల్ : వచ్చేనెల 4న ఎన్నికల కౌంటింగ్ రోజున కూటమి పార్టీల లీగల్ సెల్ విభాగాలు అనుసరించాల్సిన విధానాలు, అప్రమత్తతపై టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు మార్గనిర్దేశనం చేశారు. బుధవారం నగరంలోని టిడిపి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బిజెపి, టిడిపి,జనసేన కూటమి పార్టీల లీగల్ సెల్ అధ్యక్షులు, ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఇటీవల ఉమ్మడి విశాఖలో టిడిపి సానుభూతిపరులపై జరిగిన దాడుల విషయాన్ని విశాఖ పార్లమెంటరీ లీగల్ సెల్ అధ్యక్షులు బత్తిన రాజశేఖర్ ఆయన దృష్టికి తెచ్చారు.

ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున కూటమి లీగల్‌సెల్ న్యాయవాదులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యర్థిపార్టీల దౌర్జన్యాలను, కుట్రలను పసిగట్టి, ఎలా అధిగమించాలో వివరించారు. పోలింగ్ రోజున కూటమి పార్టీల న్యాయ విభాగం సభ్యులు క్రియాశీలక పాత్ర పోషించి, విశేషమైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి లీగల్ సెల్ అధ్యక్షులు జె. పృథ్వీరాజ్ టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిఎస్. నాయుడు, వెన్నెల ఈశ్వరరావు, ఎస్ సతీష్‌కుమార్, పల్లా బాలాజీ, పి.కిరణ్‌కుమార్, టిడిపి ప్రధానకార్యదర్శి పతివాడ గిరిధర్, ఉపాధ్యక్షులు ఉమాశంకర్, కన్నూరు అప్పలనాయుడు, ధర్మాల దుర్గాప్రసాద్, అనురాధ, మీనా, ఉమాదేవి, శాంతి, డి నరేష్ కుమార్, సనపల రమేష్, కుంద్రపు అచ్చునాయుడు, శ్రీనివాస్, రాజారావు, జనసేన లీగల్ సెల్ ప్రతినిధులు శ్రీధర్ మణికంఠ, సాయి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్లేస్కూల్స్‌పై చర్యలు తీసుకోండి

ఆర్‌జెడికి అప్సా నేతల వినతి

ఆర్‌జెడికి వినతిపత్రం ఇస్తున్న అప్సా నాయకులు

ప్రజాశక్తి -గాజువాక : నిబంధనలకు విరుద్ధంగా అదనపు తరగతులు నిర్వహిస్తున్న ప్లేస్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల సంఘం(అప్సా) నాయకులు కోరారు. బుధవారం పాఠశాల విద్య ఆర్‌జెడిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్లేస్కూల్స్ ముసుగులో నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి తరగతులతోపాటు 1,2,3 తరగతులను కూడా ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో విచ్చలవిడిగా వెలసిపోతున్న వందలాది ప్లేస్కూల్స్ పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని సంఘ సభ్యులు కోరారు. ప్లేస్కూల్స్ అంటే కేవలం ప్రీప్రైమరీ తరగతులు మాత్రమే నిర్వహించాలని, వాటికి కూడా అనుమతులు మంజూరు చేయించాలని కోరారు. ఆర్‌జెడిని కలిసిన వారిలో అప్సా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సింహాచలం, ఫైనాన్స్ సెక్రటరీ పి. భాస్కరరావు, సీనియర్ సభ్యులు ఎం..జనార్ధన్, గణపతిరావు, సత్యం, రామ్మోహన్, సత్యనారాయణ ఉన్నారు..

ఉపాధి హామీ కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాము

ప్రజాశక్తి- అచ్యుతాపురం

ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము డిమాండ్ చేశారు. మండలంలోని హరిపాలెం, పెదపాడు గ్రామాలలో బుధవారం ఉపాధి పనులు చేసే ప్రదేశాలకు ఆయన వెళ్లి కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు పనిచేసే చోట సేద తీరడానికి టెంట్లు వేయాలని, ఫస్ట్ ఎయిడ్ పరికరాలు అందుబాటులో ఉంచాలని కోరారు. మౌలిక సదుపాయాలు లేక ఇటీవల పనిచేసే చోట ఉపాధి కూలీ మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. పాముకాటుకు మందులు అందుబాటులో ఉన్నట్లయితే రక్షించడానికి వీలవుతుందన్నారు. కూలీల దాహం తీర్చడానికి మజ్జిగ ప్యాకెట్లు, మంచినీరు అందించాలని కోరారు. మండుటెండలో పనిచేస్తున్న కూలీలకు అదనంగా 30శాతం వేతనం ఇవ్వాలని, కొలతలతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రోజు కూలి రూ.300 చెల్లించాలని, ప్రతి కుటుంబానికి ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, వేతన స్లిప్పులు ఇవ్వాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి చేసిన కూలీ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శంకర్రావు, వెంకటరత్నం, మంగ, రామలక్ష్మి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము

గణేష్‌ను అభినందిస్తున్న ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి

వరల్డ్ బీచ్ పారా వాలీబాల్ పోటీలకు వికలాంగ క్రీడాకారుడు ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని ఎస్.రాయవరం మండలం సోమిదేవిపల్లి గ్రామానికి చెందిన వికలాంగ క్రీడాకారుడు అన్నం గణేష్ చైనాలో జరగనున్న అంతర్జాతీయ బీచ్ పారా ఒలంపిక్స్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి.సత్యవతమ్మ క్యాంపు కార్యాలయంలో గణేష్‌ను శాలువాతో అభినందించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ చైనాలో జరిగే పోటీల్లో పాల్గొని విజయం సాధించి జిల్లా కీర్తిని పెంచే విధంగా మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీ కాండ్రేగుల యశ్వంత్, యస్ రాయవరం మండలం వైస్సార్సీపీ నాయకులు కొణతాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

గుమ్మడి మధు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లి

సినీ నటుడు వెంకటేష్ అభిమాన సంఘం అధ్యక్షుడు గుమ్మడి మధు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన కుటుంబం ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఆంధ్రప్రదేశ్ వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ టీం సభ్యులు రూ.45వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు చందు మాట్లాడుతూ వెంకటేష్ అభిమానిగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన మధు అర్ధాంతరంగా రోడ్ ప్రమాదంలో మరణించడం జీర్ణించుకోలేకపోతున్నామని చెప్పారు. వ్యాపారంలో ఆర్థికంగా నష్టపోయిన మధు కుటుంబానికి మా సాయం అవసరం అవడం దురదృష్టకరమన్నారు. ఇబ్బందుల్లో వున్న అభిమానుల్ని ఆదుకోవడానికి ఆర్థిక సహాయన్ని అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ సభ్యులకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పి.చందు, గాజువాక రాంబాబు, ఒంపోలురాయి వెంకట రమణ, వడ్డాది పచ్చిపాల అర్జున్ పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 50 మంది విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక ఆదినారాయణ మహిళా కళాశాలలో బుధవారం జరిగిన జాబ్ మేళాలో 50 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. మూడు కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని 90 పోస్టులకు ఎంపికలు నిర్వహించారు. ఇందులో 50 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విశాఖపట్నం మద్దిలపాలెం చెందిన మ్యాజిక్ బస్ ఇండియా టెలికాలర్ పోస్టులకు, అచ్యుతాపురం యకోహామా టైర్స్ కంపెనీతో పాటు జాబ్ డీలర్ కంపెనీలు వివిధ పోస్టులకు ఎంపికలు నిర్వహించాయి. ఈ జాబ్ మేళాలో సెలెక్ట్ అయిన విద్యార్థులను ఆదినారాయణ మహిళా కళాశాల కరస్పాండెంట్ కొణతాల రఘునాథ్, అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ హెచ్ఆర్ నాగచరణ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ రాజు, యాకోహామా కంపెనీ హెచ్ఆర్ నేహా, జాబు డీలర్ హెచ్ఆర్ ట్రైనర్ అనూష, ఎంఐ ఎస్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో ఎంపికైన విద్యార్థులు

'డర్టీ ఫెలో'లో రాజకీయ నాయకునిగా సురేంద్ర

రాజకీయ నాయకుని వేషధారణలో ఉన్న మళ్ల సురేంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి

గూడూరు భద్రకాళి సమర్పణలో రాజ్ ఇండియా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లలో ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో జివిఎస్.బాబు నిర్మించిన డర్టీ ఫెలో చిత్రంలో అనకాపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర రాజకీయ నాయకుడిగా ప్రత్యేక పాత్రలో నటించారు. శాంతి చంద్ర, దీపికా సింగ్, మిస్ ఇండియా 2022 సిమ్రితి హీరో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం ఈ నెల 24న శుక్రవారం తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా రిలీజ్ అవుతుంది. సంగీతం డైరెక్టర్ సతీష్ కుమార్, సత్య ప్రకాష్, నాగి నీడు, కుమరన్, ఎఫ్ఎం బాబాయ్, సురేంద్ర, జయశ్రీ తదితరులు నటించారు. సరికొత్త కథ కథనంతో యాక్షన్ ఎపిసోడ్స్ హైలెట్‌గా ఈచిత్రం వస్తుంది. ఈ సందర్భంగా మళ్ల సురేంద్ర మాట్లాడుతూ డర్టీ ఫెలో చిత్రం 24న అనకాపల్లి రాజా థియేటర్లో రిలీజ్ అవుతుందని, మన అనకాపల్లి వాస్తవ్యులు మిత్రులు ఆడారి మూర్తిసాయి దర్శకత్వం వహించిన ఈ చిత్రం మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. చిన్న చిత్రాలను ప్రోత్సహిస్తే చలనచిత్ర రంగంలో ఎంతోమంది సినీ కళాకారులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని చెప్పారు. ఈ చిత్రాన్ని థియేటర్లో చూసి ప్రోత్సహించాలన్నారు. ఈ చిత్రంలో మంచి పాత్ర ఇచ్చినందుకు మిత్రులు హీరో శాంతి చంద్ర, ఆడారి మూర్తి సాయికు ధన్యవాదాలు తెలియజేశారు.

పాఠ్య పుస్తకాలు సిద్ధం

ప్రజాశక్తి- కె.కోటపాడు

ప్రస్తుత విద్యా సంవత్సరానికి ప్రభుత్వ స్కూళ్లలో చదివే 9, 10వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేయడానికి పాఠ్య పుస్తకాలు బుధవారం ఈ మండల కేంద్రానికి చేరాయి. మారిన సిలబస్ మేరకు అన్ని పుస్తకాలు ముందుగానే వచ్చినట్లు మండల విద్యాశాఖ అధికారి కె.సత్యనారాయణ తెలిపారు. పాఠశాలలు తెరిచిన వెంటనే వీటిని విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. మండల పరిధిలో ఒకటి కేజీబీవీ, ఏడు జిల్లా పరిషత్ హైస్కూళ్లు ఉన్నాయని, ఈ పాఠశాలల్లో పదవ తరగతి ఒక్కో విద్యార్థికి 11 పుస్తకాలు చొప్పున పాఠ్యపుస్తకాలు అందజేస్తామని తెలిపారు. అంతకుముందు మండలాలకు పాఠ్యపుస్తకాలు సరఫరా అవుతున్న తీరును సమగ్ర శిక్ష సీఎంఓ బి శకుంతల పరిశీలించారు. అనకాపల్లి జిల్లాకు సంబంధించి నర్సీపట్నం డివిజన్లో అన్ని మండలాలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందని ఆమె విలేకరులకు తెలిపారు. బుధ, గురువారాల్లో సబ్బవరం, కె.కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ, చోడవరం, బుచ్చయ్యపేట, రావికమతం, మాడుగుల ఎంఈఓలకు పుస్తకాలను అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఎటువంటి గందరగోళం లేకుండా ముందుగానే పాఠ్యపుస్తకాలు మండలాలకు చేరినట్లు వెల్లడించారు. ఆమె వెంట ఎంఈఓ 2 డివిడి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

రేపు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- సబ్బవరం

సబ్బవరం-1 సెక్షన్ పరిధిలోని 33/11కెవి సబ్బవరం సబ్ స్టేషన్ మైంటెనెన్స్ వర్క్ కారణంగా ఈ నెల 24 న శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సబ్బవరం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సబ్బవరం పంచాయతీ, తవ్వవానిపాలెం, అమ్ముతాపురం, గొల్లలపాలెం పంచాయతీలు, పైడివాడ, ఆసకపల్లి పంచాయతీ, ఇరువాడ, పల్లవానిపాలెం జాగరపువానిపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించాలని కోరారు.

రైళ్ల రద్దు తగదు

ప్రజాశక్తి-అనకాపల్లి

నిర్వహణ పనులు (ట్రాఫిక్ బ్లాక్) పేరుతో ఎక్కువ సంఖ్యలో రైళ్లను తరచూ రద్దు చేయడం తగదని, దీని వల్ల రైల్వే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ పేర్కొన్నారు. రైళ్ల రద్దుపై తక్షణం సమీక్షించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ రైల్వే బోర్డుకు బుధవారం ఆయన లేఖ పంపారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సీజన్, ప్రయాణికుల రద్దీని పరిగణనలోకి తీసుకోకుండా రైళ్ల రద్దు, దారిమళ్లింపులు చేస్తూ ఏడాది పొడవునా రైల్వే ప్రయాణికుల సహనాన్ని పరీక్షించడం దారుణమన్నారు. నిత్యం రద్దీగా, ప్రయాణికులకు అనుకూలంగా ఉండే మచిలీపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219), గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243), తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ (22708), విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220), విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244), విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ (22707), విశాఖ-గుంటూరు డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22701), గుంటూరు-విశాఖ డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22702), రాజమండ్రి-విశాఖపట్నం (07466), విశాఖ-రాజమండ్రి (07467) రైళ్లను రైల్వే శాఖ తాజాగా రద్దు చేయడం సమంజసం కాదని కాండ్రేగుల వెంకటరమణ పేర్కొన్నారు. తక్షణం ప్రయాణికుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రైళ్లను పునరుద్ధరించాలని రైల్వే బోర్డుకు రాసిన లేఖలో ఆయన డిమాండ్ చేశారు.

పోలీసు స్టేషన్‌కు 50 స్టాపర్లు వితరణ

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని తాళ్లపాలెంలో గల రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం కసింకోట మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రూ.3.50 లక్షల విలువైన 50 స్టాపర్లను బుధవారం కశింకోట పోలీస్ స్టేషన్ సిఐ వినోద్ బాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్ బాబు, రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ యూనిట్ హెడ్ పి.వీరపాండ్యన్, ఎం కళాధర్, హెచ్ఆర్ మేనేజర్ ఎం యువరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టాపర్లు అందించిన రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతినిధులు

ఎలక్ట్రికల్ సిబ్బందిని సత్కరిస్తున్న ప్రజా సంఘాల నేతలు

ఎలక్ట్రికల్ సిబ్బందికి సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో ఎలక్ట్రికల్ ఎఈ ఎం శ్రీనివాసరావు, ఎఎల్ఎం హెచ్ అబ్బాయి, లైన్మెన్ ఎస్.శివను అనకాపల్లి జిల్లా ప్రజాసంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో ఎక్కడ ఎలక్ట్రికల్ సమస్య వచ్చిన అర్ధరాత్రి అయినా సరే ఫోన్ చేసిన వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి విశేష కృషి చేస్తున్న ఎలక్ట్రికల్ సిబ్బందిని అభినందించి సత్కరించినట్లు చెప్పారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి కూడా ఇదేవిధంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే అభినందిస్తామని, నిర్లక్ష్యం వహిస్తే నిలదీస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు డాక్టర్ చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, బొబ్బిలి గోవిందరాజులు, రావి దేవుడు, ఉప్పల సాయి పాల్గొన్నారు.

నేడు యలమంచిలిలో అన్నమాచార్య సంకీర్తన

ప్రజాశక్తి - యలమంచిలి

స్థానిక శారదాంబికా శాస్త్రీయ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో గురువారం పద కవితా పితామహుడు అన్నమాచార్య సంకీర్తన గానం జరుగుతుందని నిర్వహకులు శిష్టా పెద వెంకటసోమయాజులు తెలిపారు. కార్యక్రమం సాయంత్రం 6 నుండి రాత్రి 9 గంటల వరకు కొత్తపేట సీతారామస్వామి ఆలయంలో జరుగుతుందని పేర్కొన్నారు. ముదిగొండ సావిత్రమ్మ సౌజన్యంతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో సంకీర్తనా గానం శిష్టు మధుసూదన్, వయోలిన్ ముంగండ శ్రీనివాస్, మృదంగం అప్పలి అనంతరావు సమకూరుస్తున్నట్టు నిర్వహకులు తెలిపారు.

నేడు ముత్యాలమ్మ అమ్మవారి పండగ

ప్రజాశక్తి-పరవాడ

మండల కేంద్రం పరవాడ శివాలయం రోడ్డులో ఉన్న శ్రీముత్యాలమ్మ అమ్మవారి పండగ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ పెద్దలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం 12 గంటల నుండి అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నామని తెలిపారు. సాయంత్రం డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యాలు, బాణాసంచా కాల్పులతో అమ్మవారి అనుపు ఉత్సవాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సేంద్రీయ సాగు పరిశీలన

ప్రజాశక్తి బుచ్చయ్యపేట

మండలంలోని కేపీ అగ్రహారంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణమూర్తి వ్యవసాయ క్షేత్రంలో సాగవుతున్న సేంద్రీయ సాగును శ్రీకాకుళం జిల్లా కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం పరిశీలించారు. సుభాష్ పాలేకర్ 5 లేయర్ల విధానంలో సాగుతున్న మామిడి, కొబ్బరి, బొప్పాయి, మునగ, సీతాఫలం, సపోటా తదితర పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు శశికళ, పూజిత, పల్లవి, శ్రావణి, నిఖిత, తేజ, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ సాగు గురించి వివరిస్తున్న దృశ్యం

కొత్తూరు పంచాయతీలో అవకతవకలపై విచారణ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీలో జరిగిన అవకతవకలపై లోకాయుక్తకు అందిన ఫిర్యాదుతో బుధవారం ఇన్చార్జి డిఎల్పిఓ మూర్తి విచారణ చేపట్టారు. దీనిపై ఆయన మాట్లాడుతూ 2023వ సంవత్సరంలో పంచాయతీలో జరిగిన అవకతవకలపై లోకాయుక్తకు సమాచార హక్కు చట్టం సమన్వయకర్త చింత గోపి ఫిర్యాదు చేశారని తెలిపారు. లోకాయుక్త ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి సూచనల మేరకు విచారణ చేపడుతున్నామన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణ చేపట్టారని, దీనిపై రికార్డులు అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారుల తీరుపై అసహనం

మేజర్ పంచాయతీ అయిన కొత్తూరులో సిబ్బంది నిబంధనలు పాటించకపోవడం, రికార్డులు అందుబాటులో ఉంచకపోవడం, అక్రమ నిర్మాణాలపై అవగాహన లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో ఏ పంచాయతీలోనూ ఇన్ని ఫిర్యాదులు రాలేదన్నారు. రానున్న కాలంలో సిబ్బందికి ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు.

వార్డు సభ్యుల ఫిర్యాదు

ఇదిలా ఉండగా పంచాయతీ వార్డు సభ్యులు పలు అంశాల్లో జరిగిన అక్రమాలపై డిఎల్పిఓ మూర్తికి ఫిర్యాదు చేశారు. మోటార్ల కొనుగోలు పేరుతో అక్రమాలు జరిగాయని, లక్ష 60 వేల రూపాయల విద్యుత్తు పరికరాల కొనుగోళ్లకు సంబంధించి బిల్లులు మాత్రమే ఉన్నాయని, పరికరాలు లేవని పేర్కొన్నారు. స్వీపర్ల పేరిట రూ.60 వేలు దుర్వినియోగం అయ్యాయన్నారు. పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే వాణిజ్య సముదాయాల నిర్మాణం, గృహ నిర్మాణాలు, పంచాయతీ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. దీనిపై పూర్తి విచారణ చేపట్టే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విచారణ చేస్తున్న డిఎల్పిఓ మూర్తి

చేపల చెరువుల అక్రమ నిర్వహణపై

అధికారుల చర్యలు శూన్యం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి- దేవరాపల్లి

మండలంలో అక్రమంగా చేపల చెరువులు నిర్వహిస్తున్న వారిపై సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, ముడుపులు మత్తులో వారు మునిగితేలుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న విమర్శించారు. మండలంలోని కొత్తపెంట, ములకాలపల్లి, మామిడిపల్లి, కలిగోట్ల, మారేపల్లి, చేనులపాలెం, దేవరాపల్లి, పెదనందిపల్లి, తారువా తదితర గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న చేపలు చెరువులను వెంకన్న పరిశీలించి అనంతరం బుధవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. దేవరాపల్లి మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా దాదాపుగా వెయ్యి ఎకారాల్లో అక్రమంగా చేపలు చెరువులను నిర్వహిస్తున్నారని తెలిపారు. చనిపోయిన పశుమాంసం, కోళ్ళు, గొర్రెలు, మేకల మాంసం వ్యర్థాలు, బ్రాండిక్స్ వంటి కంపెనీల క్యాంటీన్లలోని వ్యర్థాలను తీసుకొచ్చి చేపలకు మేతగా వేస్తున్నారని చెప్పారు. ఈ చేపలు తినే వారికి కేన్సర్, ఇతర భయంకరమైన వ్యాధులు వస్తున్నాయన్నారు. వీటిపై పులు మార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చేపలు చెరువులపై ఉన్న గ్రైండింగ్ మిషన్లు వెంటనే తొలగించాలని, అనుమతుల్లేకుండా చేపలు చెరువులు నిర్వహిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, చేపల మేతకు మాంసం, ఇతర వ్యర్థాల వినియోగాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు.

రాజా రామ్మోహన్‌రాయ్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

రాజా రామ్మోహన్‌రాయ్‌కి నివాళి

ప్రజాశక్తి- కశింకోట

సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్‌రాయ్ జయంతి వేడుకలు కసింకోట మండలం గొబ్బూరు గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి రాజా రామ్మోహన్‌రాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గొంతిన చిరంజీవి, నైనంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, జెర్రిపోతుల నూకునాయుడు, గొంతిన నూకరాజు, తెరపల్లి శ్రీను, మాజీ సర్పంచ్ బుద్ధా శ్రీను, పచ్చికొర శ్రీను, మళ్ల బాబు, పప్పల అప్పారావు, ఎవిఎస్ నాయుడు, బొద్దపు గోపి సాయి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గుండెపోటుకు ఖరీదైన ఇంజక్షన్లు ఉచితం

ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ రామ్మూర్తి

ప్రజాశక్తి -అనకాపల్లి

గుండెపోటు వ్యాధికి అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో ఉచితంగా రూ.30 వేలు విలువైన టెనెక్ట్ ప్లేస్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ జి రామ్మూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఆసుపత్రిని సందర్శించి పలు వార్డులను పరిశీలించారు. ఎమర్జెన్సీ, క్యాజువాలిటీ, ఆరోగ్యశ్రీ, గైనిక్, డ్రగ్ డి అడిక్షన్, బ్లడ్ బ్యాంకు తదితర విభాగాలను పరిశీలించారు. రోగులకు సరఫరా చేస్తున్న భోజనాన్ని అడిగి తెలుసుకుని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డాక్టర్ లక్ష్మణ్ శ్రీనివాస్, డైరెక్టర్ మున్నూరు శ్రీనివాసరావు, డాక్టర్ కృష్ణ, కృష్ణచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు అందుతున్న వైద్యంపై ఆరా తీస్తున్న రామ్మూర్తి

వెటరన్ యోగా క్రీడాకారిణి లక్ష్మికి సన్మానం

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం గోవిందమ్మ కాలనీకి చెందిన అంతర్జాతీయ వెటరన్ యోగా క్రీడాకారిణి ముత్యం లక్ష్మిని స్థానిక వికాస్ యోగా సెంటర్ ఆధ్వర్యంలో యోగ కేంద్రం బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యోగా గురువు పప్పల రమణమూర్తి మాట్లాడుతూ లక్ష్మి 85 ఏళ్ల వయసులో మంచి ఆరోగ్యంతో క్రీడల్లో పాల్గొంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. నేటి యువత మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడపా భూలక్ష్మి, గోపాల్‌రావు, నూకరాజు, రామకోటి, గిరి, రత్నశ్రీ, పద్మావతి, రాధ, రాధిక, శిరీషా, అనురాధ, సుజాత, మాతాజీ, విజయ, భవాని, కిరణ్మయి, రాజీ, అనిత, జ్యోతి, సత్యవతి, కనకవాణి, మహేశ్వరి, నాగేశ్వరి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి-దేవరాపల్లి

తమ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని చింతలపూడి పంచాయతీ పరిధి శివారు గ్రామమైన కొత్తూరు గ్రామంలో మహిళలు ఖాళీ బిందెలతో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి కుళాయిలు మరమ్మతులకు గురి కావడంతో మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

గర్శింగిలో గిరినాగు హల్‌చల్

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని గర్శింగి గ్రామంలో రంసాల ఈశ్వరరావు ఇంటి సమీపంలో గిరినాగు హల్ చల్ చేసింది. బదవారం ఉదయం ఇంటివెనుక భాగం నుంచి ఇంటిలోకి చొరబడుతుండగా దానిని చూశారు. పాము కొంత సేపు పరుగులు పెట్టించింది. చివరకు దానిని స్థానికులు హతమార్చారు.

హతమైన గిరినాగు

ఇళ్ల స్థలాలిచ్చారు సరే...
సౌకర్యాలు ఏవీ?

-వసతులు లేక ప్రారంభం కాని జగనన్న ఇళ్లు
-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-రోలుగుంట: **మండలంలో జగనన్న లేఅవుట్లలో కనీస వసతులు కానరాలేదు. దీంతో, గృహ నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులకు ముందుకు రాలేదు. అయినా అధికారులు పట్టించుకోలేదని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు.**

మండలంలో జగనన్న లేఅవుట్లో 547 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. వీటిలో శరభవరం, కంచుగుమ్మల, ఎంకె.పట్నం, జెపి.అగ్రహారం, అర్ల పంచాయతీ శివారు గ్రామం లోసింగి, అడ్డసరం గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం ప్రారంభించలేదు. శరభవరంలోని మెట్టపై ఇళ్ల స్థలాలు కేటాయించారు. కంచుగుమ్మల గ్రామ లబ్ధిదారులకు వారికి కేటాయించిన స్థలం గ్రామానికి దూరంగా ఉంది. ఎంకె.పట్నం, జెపి.అగ్రహారం గ్రామాల లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చి. స్థలం చూపించలేదు. లోసింగి గ్రామానికి సరైన రహదారి కల్పించకపోవడం, మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాలేదని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన రోలుగుంట గ్రామంలో 100 మందికి స్థలం పంపిణీ చేశారు. వీరికి మూడు ప్రాంతాల్లో స్థలాలు కేటాయించారు. కొండపాలెం రెవెన్యూ పరిధిలో కొంత మందికి పాత క్రషర్ ఏరియాలో మరి కొంత మందికి గౌరమ్మ కోనేరు కింద భాగాన పంపిణీ చేయగా వీరిలో గౌరమ్మ కోనేరు దిగువ భాగాన ఇచ్చిన వారికి రహదారి సౌకర్యం లేక పోవడంతో ప్రారంభించలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఈ స్థలం కొవ్వూరు వెళ్లే ఆర్అండ్బి రోడ్డు పక్కన ఉంది. రోడ్డున ఆనుకొని జిరాయితీ స్థలం ఉంది. ఆ స్థలం నుండి రోడ్డు సౌకర్యం లేక వారు ప్రారంభించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

కాలనీకి వెళ్లే లోసింగి కొండపైకి రోడ్డు మార్గం

కంచుగుమ్మల గ్రామస్థులకు కేటాయించిన స్థలం ఇదే

చోరీ చేసిన ట్రాక్టర్ విడిభాగాలు

వరుసగా చోరీలు

-ట్రాక్టర్ల విడి భాగాలు అపహరిస్తున్న దొంగలు

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంటలోని సహస్ర (రాజమండ్రి వారి క్రషర్) స్టోన్ క్రషర్ వద్ద వరుస దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయి. లక్షకు పైగా విలువ చేసే ట్రాక్టర్ల విడిభాగాలను దొంగలు మాయం చేస్తున్నారు. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమని బాధితు వాపోతున్నాడు. రోలుగుంటకు చెందిన బణికుల దేముళ్లకు చెందిన ట్రాక్టర్లు మంగళవారం క్రషర్ దగ్గర ఉంచి ఇంటికి వెళ్లి పోయాడు. దీంతో ట్రాక్టర్ల స్పేర్ పార్టులను దొంగలు మాయం చేశారు. ట్రాక్టర్‌కు ఉన్న హెడ్ లైట్స్, ఫ్యాన్, బ్యాటరీ గత రాత్రి దొంగలు విప్పుకొని వెళ్లిపోయారు. గతంలో కూడా ఇదే క్రషర్ వద్ద దేముళ్ళుకు చెందిన ట్రాక్టర్ల దమ్ము నాగలి సెట్, బ్యాటరీలు, డీజిల్ పట్టుకుని వెళ్లిపోగా రోలుగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పుడు పోలీసులు వచ్చి క్రషర్ దగ్గర పరిశీలించి విచారణ చేస్తామని చెప్పి వెళ్లిపోయారు. ఇప్పుడు మరలా అదే క్రషర్ వద్ద అదే ట్రాక్టర్ యాజమానికి చెందిన ట్రాక్టర్ల సామాగ్రి పోవడం ఆశ్చర్యకరంగా ఉంది. దీనిపై రోలుగుంట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై సురేష్ సంఘటన స్థలంలోవిచారణ చేపట్టారు.

రోజుకు రూ.600 కూలి చెల్లించాలి

ప్రజాశక్తి-గొలుగొండ: ఉపాధి కూలీలకు రోజువారీ కూలి రూ.600 చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం గొలుగొండ మండలం సి.హెచ్. ఎర్రవరం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం ఉపాధి కూలీల బడ్జెట్ గతం కంటే తగ్గించి గ్రామాలలో ఉన్న ఉపాధి కూలీలకు ఉపాధి అవకాశం లేకుండా చేస్తుందన్నారు.మండుటెండలో ఉపాధి పని చేస్తున్నప్పటికీ పని దగ్గర టెంట్, నీరు, మజ్జిగ ఇవ్వలేదన్నారు. 200 రోజులు పని దినములు పెంచాలని, పని సమయంలో మరణించినప్పుడు 10 లక్షలు కుటుంబానికి ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు కొండలరావు, మండల కార్యదర్శి అప్పలనాయుడు పాల్గొన్నారు.

27 నుంచి నోటి కేన్సర్‌పై అవగాహనా వారోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : ఈ నెల 31న 'నో టోబాకో డే' సందర్భంగా గీతం దంత కళాశాల, ఆసుపత్రి ప్రజారోగ్య దంత వైద్య విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నోటి కేన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి డాక్టర్ మనీష్‌కుమార్ తెలిపారు. పొగాకు ఉత్పత్తులను వాడే వారు నోటి కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నెల 27 నుంచి వారం రోజుల పాటు గీతం దంత కళాశాల ఆసుపత్రి, గీతం వైద్య కళాశాలలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పొగాకు ఉత్పత్తులను వాడుతున్న వారంతాఈ స్క్రీనింగ్ పరీక్షలను చేయించుకోవడం ద్వారా రాబోయే ప్రమాదాన్ని తెలుసుకుని తగిన చికిత్సతో జాగ్రత్తపడవచ్చునని సూచించారు.

శ్మశాన వాటికలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని రామచంద్రాపురం శ్మశానవాటిక స్థలం ఆక్రమణకు ఇటీవల కొంత మంది ప్రయత్నించారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించారు. బుధవారం శ్మశాన వాటిక స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ స్థలాన్ని ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

విద్యార్థులకు విజ్ఞానదాయక కార్యక్రమాలు

నక్కపల్లిలో వ్యాస రచన రాస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి కే.జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం ఎంతో ఉత్సాహంగా జరుగుతున్నాయి. బుధవారం విద్యార్థులకు జీవ వైవిధ్యం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లీష్ క్లబ్ వ్యవస్థాపకులు వై.వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు జూన్ 7వ తేదీన ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయ అధికారి జనార్ధన్ తెలిపారు.

అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం శాఖా గ్రంథాలయం గ్రంథాలయధికారిణి పి.దమయంతి ఆధ్వర్యంలో బుధవారం సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఇందులో నాన్న నా హీరో అన్న విషయన్నీ విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ కథ రూపంలో వివరించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులురెడ్డి రాజా రామ్‌మోహన్ రాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులురెడ్డి మాట్లాడుతూ, బాల్య వివాహాలు, సతీసహగమనంపై విపులంగా వివరించారు. రీసోర్స్ పర్సన్ రూన్సీ తెలుగు నెలలను వరుస క్రమంలో ఎలా జ్ఞాపకం ఉంచుకోవాలో కథ రూపంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ ఉపాధ్యాయులు రవికుమార్ డ్రాయింగ్‌లో మెళకువలు నేర్పించారు.

గొలుగొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో బుధవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పుస్తక పఠనం, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు త్రిమూర్తులరెడ్డి హాజరై మాట్లాడుతూ, సైన్స్‌లో జ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. గొలుగొండ ఏఎన్ఎం లక్ష్మీ మాట్లాడుతూ పిల్లలందరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొలుగొండలో మాట్లాడుతున్న త్రిమూర్తులురెడ్డి

సబ్బవరం: పుస్తక పఠనం వలన విద్యార్థులు మేధోసంపతిని పెంపొందించుకోవచ్చని సబ్బవరం శాఖా గ్రంథాలయం అధికారి వి.కుమారి శిరీష అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. వార్తా పత్రికల పఠనం చేయించారు.

మునగపాక : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎల్వి రమణ బుధవారం ప్రారంభించారు. ఇందులో విద్యార్థులతో నీతి కథలు చదివించి, వాటి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. విజేతలకు 7న జరిగే ముగింపు సభలో బహుమతుల ప్రదానం చేయడం జరుగుతుందని చెప్పారు.

విత్తనాలు పంపిణీ చేస్తున్న వైసిపి నేత

ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా..
వైసిపి నేత విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని జోగంపేట పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో స్థానిక వైసీపీ నాయకుడు చిటికెల వరహాలబాబు చేతుల మీదగా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు విత్తనాలు బుధవారం పంపిణీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ప్రభుత్వ కార్యకలాపాలలో రాజకీయ నాయకుల ప్రమేయం ఉండరాదన్న నిబంధనను బేఖాతరు చేస్తూ వైసీపీ నాయకుడు సమక్షంలోనే మండల వ్యవసాయ అధికారి సుధారాణి, ఆర్బీకే అధికారిణి సత్యవేణి రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సంఘటనపై టీడీపీ నాయకులు డివిజనల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

- ఆర్ఒ గీతాంజలి

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామని, 22 రౌండ్లు లెక్కింపు వుంటుందని ఆర్వో కె.గీతాంజలి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ, పోస్టల్ బ్యాలెట్లతో కలిపి మొత్తం 22 రౌండ్లు వుంటాయన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ కోసం రెండు టేబుళ్లు ఏర్పాటు చేసే అవకాశం వుందన్నారు. లేదా 500 ఓట్లకు ఒక టేబుల్ ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో 2111 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలైనట్టు తెలిపారు. నియోజకవర్గంలో 2,50,744 ఓట్లకు గాను, 2,06,626 ఓట్లు పోలయ్యాయన్నారు.

ఉపాధ్యాయుడు బాబూరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి -నక్కపల్లి :మండలంలోని డిఎల్ పురం గ్రామానికి చెందిన ఉపాధ్యా యుడు కోన బాబూరావుకు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం పీహెచ్‌డీ (డాక్టరేట్)ను ప్రదానం చేసింది. ఉపాధ్యాయుడు కోన బాబూరావు పాయకరావుపేట మండలం సత్యవరం హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యా యుడిగా పనిచేస్తున్నారు. బాబూరావు అర్థ శాస్త్రంలో బ్రిడ్జింగ్ జెండర్ గ్యాప్ ఇన్ ప్రైమరీ ఎడ్యుకేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అంశంపై చేసిన పరిశోధనకు గాను ఆయనకు డాక్టరేట్ లభించింది. రెండు రోజుల కిందట తాను ఈ పురస్కారాన్ని పొందానని బాబూరావు తెలిపారు. ఈ మేరకు సత్యవరం హైస్కూల్ హెచ్‌ఎం ఎన్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు, తోటి ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

పరీక్షిస్తున్న వైద్యులు

కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- చీడికాడ :మండలంలోని ఖండివరం గ్రామం లో తులసి కళ్యాణమంపం వద్ద జిల్లా అందత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి (విశాఖపట్నం) ఆధ్వర్యాన మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో 102 మంది కంటి రోగులకు పరీక్షలు చేయగా 43 మందిని ఆపరేషన్‌కు గుర్తించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి బస్సులో తరలించారు. ఈ కార్యక్రమంలో ఖండివరం గ్రామ పెద్దలు, ఆప్తలమిక్ ఆఫీసర్ హరి చందన శంకర్, ఫౌండేషన్ క్యాంపు డెప్యూటీ మేనేజర్ ఎం.అరుణ్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ సహకారంతో మరుగుదొడ్ల నిర్మాణం

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయానికి ఆర్డీవో జయరాం అభ్యర్థల మేరకు కార్యాలయ సందర్శకుల ప్రయోజనార్థం లయన్స్ క్లబ్ తరపున డాక్టర్ అధికార గోపాలరావు, నవ్య, లయన్స్ క్లబ్ తరపున వెలగా నారాయాణరావు సౌచాల యాలు నిర్మించారు. ఈ మేరకు బుధవారం ఆర్డీవో జయరాంకు వీటికి సంబంధించి తాళాలను అందజేశారు.

తాళాలు ఇస్తున్న ప్రతినిధులు

కొత్తకోటలో కార్డెన్ సెర్చ్

-రికార్డులు లేని వాహనాలు స్వాధీనం

స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో పోలీసులు కార్డన్ సెర్చ్‌ను బుధవారం నిర్వహించారు. కొత్తకోట సీఐ అప్పలనాయుడు, ఎస్సై లక్ష్మణరావులు సిబ్బందితో కలిసి బుధవారం తెల్లవారు జామునుంచే ముఖ్యమైన కూడళ్ళు, గ్రామ శివార్లకు వెళ్ళి వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా సిఐ అప్పలనాయుడు మాట్లాడుతూ, రికార్డులు లేని సుమారు 72 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలు, బొలారో, కారులను స్వాధీనం చేసుకున్నామన్నారు. రికార్డులు పరిశీలించి కరెక్టుగా ఉంటే వాహనాలు విడుదల చేస్తామని, లేదంటే కేసులు నమోదు చేస్తామని సిఐ స్పష్టం చేశారు.అడ్డు అదుపు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై చర్యలు తప్పవని ఆయన తెలిపారు. ఎన్నికల ఫలితాలు వెలువడే సమయం దగ్గర పడుతున్నందున గ్రామాలలలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటు న్నామన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ పరిధిలో కొత్తకోట, రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట ఎస్సైలు లక్ష్మణరావు, సురేష్, ధనుంజయనాయుడు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

'రిఫరల్ ఆసుపత్రిగా నక్కపల్లి సిహెచ్‌సి'

బాధితుడిని పరామర్శిస్తున్న టిడిపి నేత వెంకటేష్

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి 50 పడకల ఆసుపత్రి రిఫర్ ఆసుపత్రిగా మారిందని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన కట్టా ఏసు ఈనెల 14న రోడ్డు ప్రమాదంలో గాయపడి, అనకాపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు బుధవారం ఆయనను వెంకటేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, ఈనెల 14న రోడ్డు ప్రమాదంలో కట్టా ఏసు గాయపడటంతో కుటుంబ సభ్యులు ఆయనను స్థానిక నక్కపల్లి 50 పడకల ఆసుపత్రికి తీసుకు వెళ్లగా, కాలుకు ఎక్స్ రే తీసి, ప్రథమ చికిత్స అందించారన్నారు. కాలు ఫ్యాక్చర్ అవ్వలేదని, బాగానే ఉందని మరో ఆరు రోజుల తర్వాత రమ్మని వైద్యులు చెప్పారన్నారు.కాలు విపరీతంగా నొప్పి రావడంతో ఆసుపత్రికి వెళ్ళగా , మరలా ఎక్స్ రే తీసి కాలు ఫ్యాక్చర్ అయిందని, అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని చెప్పడంతో వెంటనే అక్కడ అడ్మిట్ చేశారన్నారు. నక్కపల్లి ఆసుపత్రి వైద్యుడు నిర్లక్ష్యంతో గాయపడ్డ బాధితుడు తీవ్ర ఇబ్బందులు పడవలసి వచ్చిందన్నారు.నక్కపల్లి సిహెచ్‌సీలో పూర్తిస్థాయిలో వైద్యులు ఉన్నప్పటికీ సరైన వైద్యం అందకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, చాలా కేసులు రిఫర్ చేస్తున్నారని ఆరోపించారు.జిల్లా కలెక్టర్, డిసి హెచ్ నక్కపల్లి ఆసుపత్రి పై ప్రత్యేక దృష్టి సారించి రోగులకు మెరుగైన వైద్యం అందే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు .

యూనిటీ ట్రస్ట్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:సామాజిక సేవ దృక్పథంతో అరకులోని యూనిటీ ఫర్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర చెప్పారు. యూనిటీ ఫర్ ఛారిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దఅంజోడ, బొందుగూడలో పాల డబ్బాలు కొనలేని ఆర్థిక పరిస్థితులో ఇబ్బంది పడుతున్న వారికి బుధవారం అరకులోని ట్రస్ట్ కార్యాలయంలో ఉచితంగా పాల డబ్బాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివాసీ చిన్నారులను దత్తత తీసుకొని ఏడాది పాటు ఉచితంగా పాల డబ్బాలు అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నీలి జోష్ఫిన్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, అంగన్ వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాల డబ్బాలను పంపిణీ చేస్తున్న సురేంద్ర

స్ట్రాంగ్ రూములపై నిరంతర పర్యవేక్షణ

ప్రజాశక్తి -పాడేరు: స్థానిక డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూములను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, పాడేరు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట్, అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, అడిషనల్ ఎస్పీ ధీరజ్‌లు పరిశీలించారు. ప్రతిరోజు స్ట్రాంగ్ రూములో తనిఖీల్లో భాగంగా బుధవారం సందర్శించి తనిఖీ చేశారు. ఓట్ల లెక్కింపు విభాగాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం లాగ్ బుక్ లో అధికారులంతా సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డివిఆర్ ఎం.రాజు, డిఈ అనుదీప్, సిఐ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోతుల మయంగా ఉన్న రోడ్డు

రహదారి అస్తవ్యస్తం

ప్రజాశక్తి -రోలుగుంట:మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం కూడలి వద్ద ఆర్‌అండ్‌బి రోడ్డు చెరువును తలపిస్తోంది. ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు వస్తుందోనని రోలుగుంట గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చోడవరం నుండి నర్సీపట్నం వెళ్లే ప్రధాన రహదారి గోతులమయం ఉండటంతో ఏ మాత్రం వర్షం పడినా నీరు చేరుతోంది. దీంతో, ఎంత గోయి ఉందో తెలియక ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు.ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లే కూడలికావడంతో మరింతగా ఇబ్బందులు పడుతున్నారు. నిధులు మంజూరురైనా, పనులు చేయలేదని, కాంట్రాక్టర్ టీడీపీ నాయకుడు కావడంతో ఈ దుస్థితి ఏర్పడిందని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ గతంలో ఆరోపించారు. రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.